## క్లుప్తంగా

### 29 నుంచి క్రీడాపోటీలు

**రామగుండం:** ఈనెల 29, 30ల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రామగుండం జోన్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు సోమవారం జోనల్ కార్యదర్శి తుల శోభారాణి తెలిపారు. బాల బాలికలకు అండర్–14, 17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నామన్నారు.

**కాల్వశ్రీరాంపూర్:** మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల నిర్వహణలో భాగంగా ఎంఈవో మహేశ్‌కుమార్ సోమవారం వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 21, 22, 23ల్లో నిర్వహించే ఈ పోటీలను విజయవంతం చేయాలని మండలంలోని వివిధ గ్రామాల హెచ్‌ఎంలు, పీఈటీలను కోరారు.

### రేపు ఇసుక వేలం

**కాల్వశ్రీరాంపూర్:** గంగారం గ్రామంలో ఇటీవల స్వాధీనం చేసుకున్న ఇసుకను విక్రయించేందుకు ఈనెల 20న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉదయం 11 గంటలకు రూ.5వేలు డిపాజిట్ చెల్లించిన వారు వేలంలో పాల్గొనొచ్చన్నారు.

### సన్మానం



**జూలపల్లి:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సనత్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా శాలువాతో సన్మానించారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవలకు అవార్డు అందుకున్న సందర్భంగా సత్కరించారు. మానుమండ్ల శ్రీనివాస్, దాడి కుమార్‌యాదవ్, బెజ్జెంకి సంతోష్, మొదుంపెల్లి అజయ్ తదితరులున్నారు.

### జేసీబీని సీజ్ చేయాలి

**సుల్తానాబాద్:** తాటి, ఈత చెట్లను అక్రమంగా తొలగించిన జేసీబీని సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సోమవారం గీత కార్మికులు ఎక్సైజ్ సీఐ గురునాథ్‌ను కలిశారు. మండల కేంద్రంలోని కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా తాటి, ఈత చెట్లను జేసీబీ సహకారంతో సెలవు దినాల్లో తొలగించారని ఆరోపించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ చిరంజీవిని వివరణ కోరగా.. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. బూరుగు రవి, పొన్నం సంపత్, ఓదెలు, శ్రీనివాస్, ఆకుల స్వామి, కొయ్యడ లచ్చయ్య, జక్కుల అయోధ్య, అడ్డగుంట రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు

### యూరియా కొరతతో ఇబ్బందులు

**ఎలిగేడు:** యూరియా కొరతతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు న్యాతరి పోచయ్య అన్నారు. సోమవారం ఎలిగేడులో విలేకరులతో మాట్లాడారు. ఎలిగేడు ప్రాథమిక సహకార సంఘంలో రైతులు యూరియా కోసం ఉదయం నుంచే నీరు, ఆహారం లేక బారులు తీరి వరుసలో ఉన్నారన్నారు. యూరియా అందక పంటలు నష్టపోతే రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదముందని అన్నారు.

### నిరుపేదలకు వరం ఇందిరమ్మ ఇల్లు



కనగర్తిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రెడ్డి

**ఓదెల:** నిరుపేదలకు వరాలు ఇందిరమ్మ ఇళ్లని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం కనగర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆశీస్సులతో నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాహుల్‌గౌడ్, ఉడిగె సదయ్య, మహేందర్ పాల్గొన్నారు.

### ఎస్సారెస్పీ భూమి కొనుగోలు చేసినవారి అరెస్ట్

**ధర్మారం:** ధర్మారం శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భూమిని అక్రమంగా కొనుగోలు చేయడంతోపాటు అధికారులను బెదిరించిన ఇదే గ్రామానికి చెందిన యంసాని మహేశ్, యంసాని మధు, యంసాని మనోజ్‌ను సోమవారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఎస్సారెస్పీ భూమిని ఇదే గ్రామానికి చెందిన యంసాని మహేశ్ దొంగపత్రాలు సృష్టించిన వారినుంచి తన కుమారుల పేరిట ఇటీవల కొనుగోలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు.. ఈ భూమి ఎందుకు కబ్జా చేశావని మహేశ్ ప్రశ్నించారు. దీంతో మహేశ్, మధు, మనోజ్ కలిసి.. ఈ భూమి వద్దకు వస్తే చంపుతామని అధికారులను బెదిరించారు. ఈమేరకు 23 ఏప్రిల్ 2025న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన ఎస్సై.. యంసాని మహేశ్‌తోపాటు ఆయన కుమారులు యంసాని మధు, యంసాని మనోజ్‌ను అరెస్టు చేశారు.

# రహదారిపై రక్షణ చర్యలు శూన్యం



**రామగుండం:** రామగుండం బైపాస్ రోడ్డు మలుపుల వద్ద రక్షణ చర్యలపై హెచ్‌కేఆర్ అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారనేది సుస్పష్టం. ఇంధన నిల్వల కేంద్రాల నుంచి రామగుండం ఎక్స్‌రోడ్ వరకు బైపాస్ రోడ్డు మలుపుల వద్ద ఇరువైపులా రక్షణగా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు విరిగిపోయాయి. ఫలితంగా వాహనం అదుపు తప్పితే నేరుగా డ్రైనేజీలోకి దూసుకెళ్లే ప్రమాదముంది. మల్యాలపల్లి సబ్ స్టేషన్ నుంచి ఎన్టీపీసీ కూలింగ్ టవర్స్ వరకు ఇరువైపులా రాజీవ్ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతోపాటు వాహనాలు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అయినా హెచ్‌కేఆర్ సంస్థ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోగా.. పలు రోడ్డు ప్రమాదాల్లో వాహనాలు ఢీకొనడంతో విరిగిన సిమెంట్ దిమ్మెలను పునరుద్ధరించకపోవడం నిర్లక్ష్యానికి నిలువుటద్దం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హెచ్‌కేఆర్ సంస్థపై ఒత్తిడి తీసుకొచ్చి ట్రాఫిక్ నిబంధనలను అమలు చేసే దిశగా కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



**మంథనిరూరల్:** రోడ్డు ప్రమాదాల నివారణలో సంబంధిత శాఖ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రమాదం జరిగి ప్రాణ నష్టం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం తప్పా.. అసలు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టడం లేదు. మల్లెపల్లి సమీపంలోని మంథని–గోదావరిఖని ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. తరచూ ఈ గుంతలో పడి ద్విచక్ర వాహనదారులు గాయాలపాలవుతున్నా స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

**మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500**

## సర్వాయి పాపన్నకు నివాళి



మంథని: పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



పెద్దపల్లిరూరల్: సబ్బితంలో ఎల్లమ్మ ఆలయం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



సుల్తానాబాద్‌లో కేక్ కట్ చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్



యైటింక్లయిన్‌కాలనీ: నినాదాలు చేస్తున్న గౌడ సంఘం నాయకులు

బహుజనులంతా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తిని చాటి చెప్పాలని పలువురు వక్తలు అన్నారు. పాపన్న జయంతి సందర్భంగా జిల్లాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పలు పార్టీల నాయకులు, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
– సాక్షి నెట్‌వర్క్



రామగుండం: పాల్గొన్న హిందూవాహిని ప్రతినిధులు



ఎలిగేడు: ధూళికట్టలో..



జూలపల్లి: పెద్దాపూర్‌లో..



సుల్తానాబాద్‌రూరల్: తొగర్రాయిలో..

## సమస్యలు పరిష్కరించాలని నిరసన దీక్ష



కమాన్‌పూర్‌లో బీజేపీ నాయకుల దీక్ష

**కమాన్‌పూర్:** మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద కరపత్రాలను ఆవిష్కరించి నిరసన దీక్ష చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము మాట్లాడుతూ.. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా మండల కేంద్రంలో మాత్రం అభివృద్ధి జరగడం లేదన్నారు. కొయ్యడ సతీశ్, మట్ట శంకర్, జంగపెల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఓపీ రిజిస్ట్రేషన్‌లో మెరుగైన సౌకర్యాలు



షెడ్‌లో స్టీల్ బెంచీలు

**కోల్‌సిటీ:** గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని పాత బిల్డింగ్‌లో రెగ్యూలర్ ఓపీ రిజిస్ట్రేషన్ దగ్గర పేషెంట్ల ఇబ్బందులను స్వయంగా చూసి స్పందించిన కలెక్టర్ ఓపీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. కలెక్టర్ ఆదేశాలతో ఇటీవల క్రిటికల్ కేర్ బిల్డింగ్ ఎదుట ప్రత్యేక షెడ్డును నిర్మించిన అధికారులు.. దాన్ని రెగ్యూలర్ ఓపీ విభాగంగా ఆధునికీకరించారు. ఈ కొత్త షెడ్డులోనే రెగ్యూలర్ ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తుండగా.. ఓపీ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన పేషెంట్ల కోసం స్టీల్ బెంచీలను సోమవారం సాయంత్రం ఏర్పాటు చేశారు.

## అంగన్‌వాడీల్లో ప్రీప్రైమరీ విద్య బోధించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకురాళ్లు

**పెద్దపల్లిరూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం విద్య పేరుతో అంగన్‌వాడీలకు వచ్చే ఐదేళ్ల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగించడం సరికాదని అంగన్‌వాడీ టీచర్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి అన్నారు. కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌కు సోమవారం యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షురాలు వనజారాణి, హేమలత, రామలక్ష్మి, ఉమారాణి, కృష్ణకుమారి, భాగ్య, అరుణ తదితరులున్నారు.

## కొడుకు నేత్రాలు.. ఇద్దరికి కంటి వెలుగులు



సాయిసూర్యగౌడ్(ఫైల్)

**కోల్‌సిటీ(రామగుండం):** గోదావరిఖని మార్కండేయ కాలనీలో కొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులు.. మరో ఇద్దరు అంధులకు తమ కొడుకు నేత్రాలను దానం చేసి కన్న కొడుకు చూపును సజీవంగా ఉంచారు. సింగరేణి సంస్థ రామగుండం రీజియన్‌లోని ఏరియా స్టోర్‌లో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న గంగాధరి రమేశ్–శోభారాణి దంపతుల కొడుకు సాయిసూర్యగౌడ్(25) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన సాయిసూర్య.. ఆదివారం సాయంత్రం ఇంట్లోని బాత్‌రూంలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి కొడుకు కార్నియాలను దానం చేయడానికి అంగీకారం తెలిపారు. సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్‌నాయక్ సహకారంతో మృతుడి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు.

### వినియోగంలోకి రక్త కణాలు లెక్కించే యంత్రం



సాక్షి స్పందన

**కమాన్‌పూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్త కణాలు లెక్కించే యంత్రం(ప్లేట్‌లెట్)ను అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈనెల 8న సాక్షి దినపత్రికలో పీహెచ్‌సీలో పని చేయని రక్త కణాలు లెక్కించే యంత్రం అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు యంత్రానికి మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు.

**ప్రహరీ నిర్మాణం**

**సుల్తానాబాద్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆనుకొని ఉన్న ప్రహరీ నిర్మాణ పనులను సోమవారం కాంట్రాక్టర్ చేపట్టారు. ఈనెల 17న సాక్షిలో గోడ అక్రమంగా కూల్చివేత కథనానికి అధికారులు స్పందించారు.

### అధికారుల సర్వే

**గోదావరిఖని:** హైకోర్టు ఆదేశంతో స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని పోచమ్మ మైదానం స్థలంపై ప్రభుత్వ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. వివాదాస్పద స్థలంపై హైకోర్టుకు వెళ్లిన క్రమంలో నిశితంగా టిపన్ సర్వే జరిపారు. సర్వే నంబర్, భూమి హద్దుల ప్రకారం సర్వే కొనసాగింది. సర్వే ల్యాండ్ రికార్డు, మున్సిపల్, సింగరేణి అధికారులు, స్థలం యాజమానుల సమక్షంలో శాటిలైట్ సిగ్నల్స్ ద్వారా ఈ సర్వే కొనసాగింది. సర్వే రిపోర్టును సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### వైభవంగా శోభాయాత్ర



**పాలకుర్తి:** బోడగుట్టపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణ భగవానుడి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈనెల 16న గ్రామానికి చెందిన నాగిరెడ్డి ఇంటి ఆవరణలో శ్రీకృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేసి 3 రోజులపాటు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు బోడగుట్టపల్లి గ్రామం నుంచి కొత్తపల్లి, శాలపల్లి గ్రామాల మీదుగా శోభాయాత్ర నిర్వహించగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ నిర్వాహకులు నాగిరెడ్డి, రాజు, దీక్షిత్, మహేశ్, బాలకృష్ణ, మధు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణాష్టమి వేడుకలు



**ఫెర్టిలైజర్‌సిటీ:** రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ చైతన్యపురికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో అలంకరించి ఉట్టి కొట్టించారు. అంగన్‌వాడీ కార్యకర్త శైలజ, పోషకులు పాల్గొన్నారు.

### 22 వరకు టెండర్ల స్వీకరణ

**పెద్దపల్లిరూరల్:** జిల్లాలోని అన్ని హాస్టళ్లకు ఆహార పదార్థాలను సరఫరా చేసేందుకు ఆసక్తి ఉన్నవారు ఈనెల 22 లోగా టెండర్లు దాఖలు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి అవసరమైన కిరాణ సరుకులు, కూరగాయలు, పండ్లు, స్కిన్‌లెస్ చికెన్, మటన్ క్యాటరింగ్ సేవలందించాల్సి ఉంటుందని వివరించారు.

### చికిత్స పొందుతూ మృతి

**పెద్దపల్లిరూరల్:** పట్టణంలోని పెద్దమ్మనగర్ ప్రాంతంలో ఈనెల 16న జరిగిన ప్రమాదంలో గాయపడ్డ గంగాధరి దుబ్బయ్య(50) కరీంనగర్‌లో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. బైక్‌పై పెద్దపల్లి వైపు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందని మృతుడి భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### అపూర్వ సమ్మేళనం



**ఎలిగేడు:** సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 2012–13లో పదోతరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. గురువులను సన్మానించారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

## సింగరేణి వార్తలు

### ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకం



ప్రసంగిస్తున్న జీఎం వెంకటయ్య

**గోదావరిఖని:** ప్రమాదాల నియంత్రణలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. సోమవారం ఏరియాలోని ఎంవీటీసీ ఆధ్వర్యంలో సిమ్‌టార్స్‌లో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల స్ట్రక్చర్డ్ ట్రెనింగ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్, ఎస్‌ఓటూ జీఎం రాముడు, ఏరియా రక్షణ అధికారి సంతోష్‌కుమార్, వీటీసీ మేనేజర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

### అంకితభావంతో విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

**రామగిరి:** ప్రతీ ఉద్యోగి సమయపాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్జీ–3, ఏపీఏ ఉద్యోగులకు నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్, ఐఈ డీజీఎం కె.చంద్రశేఖర్, ఫైనాన్స్ డీజీఎం సి.జె.సురేఖ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**గోదావరిఖని:** ఆర్జీవన్ ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశాలు సోమవారంతో ముగిశాయి. వారం రోజులుగా ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై ఈ సమావేశాలు నిర్వహించి సంస్థ స్థితిగతులపై కార్మికులను చైతన్యం చేశారు. కమిటీ అధికారులు ఆంజనేయులు, బ్రహ్మాజీ, రవీందర్‌రెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### వలకు చిక్కిన కొండచిలువ



**కమాన్‌పూర్:** మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద సోమవారం ఉదయం పెద్ద కొండచిలువ వలకు చిక్కింది. చెరువు నీటిమట్టం పెరిగి అలుగు పారుతుండడంతో.. చెరువులోని చేపలు వెళ్లకుండా మత్స్యకారులు మత్తడికి అడ్డుగా వల ఏర్పాటు చేశారు. మత్స్యకారులు పిడుగు భీమయ్య, మబ్బు శంకర్, పిట్టల తిరుపతి ఉదయం మత్తడి వద్దకు వెళ్లగా.. వలలో చిక్కిన కొండచిలువను బయటికి తీసి వదిలిపెట్టారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**కాల్వశ్రీరాంపూర్:** 2 రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, వివిధ ప్రాంతాల్లో వరద ప్రమాదం పొంచి ఉందని, కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు చోటుచేసుకుంటాయని, ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు, ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ముఖ్యంగా చెరువుల కింద ఉన్న ఒర్రెలు, లోలెవల్ వంతెనలు, కల్వర్టుల వద్ద వాహనదారులు, రైతులు, వ్యవసాయ కూలీలు, స్కూల్, ఆర్టీసీ బస్సులు దాటేందుకు సాహసం చేయకపోవడమే ఉత్తమమన్నారు.

**50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు**

**పెద్దపల్లిరూరల్:** పంట సాగుకు అవసరమైన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను 50 శాతం రాయితీపై అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి అలివేణి అన్నారు. రైతులకు బ్యాటరీ, పవర్ ఆపరేటర్ స్ప్రేయర్లు, రొటోవేటర్, సీడ్‌కం ఫర్టీగ్రిల్, కల్టివేటర్, బ్రష్‌కట్టర్ అందుబాటులో ఉన్నాయన్నారు.

**సుల్తానాబాద్:** ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2025లో భాగంగా సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో నాగార్జున, ఏఈవోలు పద్మ, రవితేజ, సౌమ్య తెలిపారు.

**రామగుండం:** అంతర్గాం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేయనున్నామని సోమవారం మండల వ్యవసాయాధికారి కల్వల సతీశ్ తెలిపారు.

**ఎలిగేడు:** వివిధ వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ కోసం రైతులు ఈనెల 23 లోగా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం లేదా ఎలిగేడు రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలని ఏవో ఉమాపతి తెలిపారు.

**రైతులకు సరిపడా యూరియా నిల్వలు**

**జూలపల్లి:** మండల రైతులకు సరిపడా యూరియా నిల్వలున్నాయని మండల వ్యవసాయాధికారిణి టి.ప్రత్యూష అన్నారు. జూలపల్లిలో సోమవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం యూరియా 65.16టన్నులు, డీఏపీ 10.35 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 27.65 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్సు ఎరువులు 42.75 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు.

**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేశ్**

**ఓదెల:** జీలకుంట గ్రామానికి చెందిన చర్లపల్లి సురేశ్‌గౌడ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, ఉపాధ్యక్షురాలు బీమగాని సౌజన్య తెలిపారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక**



అక్షిత్‌గౌడ్

**సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి):** గర్రెపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వి.అక్షిత్‌గౌడ్ అండర్–15 వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం కవిత తెలిపారు. రామగుండంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. విద్యార్థి, పీడీ ఆసీయాబేగంను హెచ్‌ఎం అభినందించారు.

**రాజ్ కలశ యాత్రకు స్వాగతం**

**సుల్తానాబాద్:** సుల్తానాబాద్‌లో అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో రేజంగ్ల రాజ్ కలశ యాత్రకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి దండలు సమర్పించారు. పలువురు మాట్లాడుతూ.. 1962 భారత, చైనా యుద్ధంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన 114 మంది యాదవ వీర యోధులున్నారన్నారు.